# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 25 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## బీఆర్ఎస్‌కు కరీంనగర్ మేయర్ రాజీనామా..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



కరీంనగర్ మేయర్ వై సునీల్ రావు బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను శుక్రవారం రాత్రి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కే చంద్ర శేఖర్ రావుకు పంపారు. శనివారం సునీల్ రావు బీజేపీలో చేరనున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు కరీంనగర్ లో ఎస్.బి.ఎస్. పంక్షన్ హాలులో బీజేపీలో చేరతారు. గత ఐదేళ్లుగా తనకు మద్దతు పలికిన కరీంనగర్ నగర ప్రజలకు శుక్రవారం రాత్రి సునీల్ రావు ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ నగర కార్పొరేటర్లు, నాయకులు, తన అభిమానులు, మద్దతు దారులకు కూడా ధన్య వాదాలు చెప్పారు. కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ను కరీంనగర్ నగరానికి సునీల్ రావు ఆహ్వానించారు. కేంద్ర మంత్రి ఖట్టర్ ఆధ్వర్యంలో స్మార్ట్ సిటీ కార్యక్రమం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రస్తుత కరీంనగర్ నగర పాలక సంస్థ పదవీ కాలం ఈ నెల 28తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో మేయర్ వై సునీల్ రావు శుక్రవారం అన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

## ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు



- 8 మంది మృతి, ఏడుగురికి గాయాలు
- మహారాష్ట్రలో ఘటన

బలగం టీవి, ముంబయి

మహారాష్ట్రలో భండారా జిల్లాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో శుక్రవారం భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడులో 8మంది మరణించగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా వున్నట్లు అధికారులు తెలిపారు. పేలుడు జరిగిన సమయంలో ఆ సెక్షన్‌లో 14మంది ఉద్యోగులు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఉదయం 10.30గంటల సమయంలో పేలుడు చోటు చేసుకుంది. పేలుళ్ళ శబ్దాలు దాదాపు 5కిలోమీటర్ల వరకు వినిపించినట్లు అక్కడి ప్రజలు చెబుతున్నారు. పేలుళ్ళ ధాటికి ఫ్యాక్టరీ పైకప్పు పూర్తిగా కుప్పకూలింది. పేలుళ్ళ కారణంగా ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగ కమ్ముకుంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ సంజరు కోల్తే తెలిపారు. శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుపోయి వుంటారని భావిస్తున్నట్లు చెప్పారు. జాతీయ విపత్తు నిర్వహణా బృందం, రాష్ట్ర విపత్తు నిర్వహణా బృందం, స్థానిక అగ్ని మాపక దళ సిబ్బంది, నాగపూర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సహాయక చర్యల్లో నిమగమయ్యారని భండారా పోలీసు సూపరింటెండెంట్ నూరల్ హసన్ తెలిపారు. ఇది పెద్ద ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అయినందున చాలామంది లోపల వుండి వుంటారని అనుమా నిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఏడుగురిని కాపాడామని, మరో ఆరేడుగురు శిధిలాల్లో చిక్కుకుని వుండవచ్చని భావిస్తున్నట్లు భండారా జిల్లా సమాచార కార్యాలయం ఎక్స్‌లో పోస్టు చేసింది.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ప్రమాదం పట్ల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియచేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని రాజ్‌నాథ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.



## పీఎంఏవై కింద

# 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలి

- మూసీకి రూ.10వేల కోట్లు ఇవ్వండి
- మెట్రో ఫేజ్2 ను జేవీగా చేపట్టాలి
- హైదరాబాద్, వరంగల్ డ్రయినేజీ స్కీంలకు కూడా....
- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 కింద 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ మనోహర్ లాల్ ఖట్టర్ గారికి విజ్ఞప్తి చేశారు. పీఎంఏవై 2.0లో చేరిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని గుర్తుచేస్తూ, ఇందుకు సంబంధించిన సమగ్ర డేటా సిద్ధంగా ఉన్నందున రాష్ట్రానికి ఆ మేరకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. దేశంలోని మహానగరాలైన ఢిల్లీ, చెన్నై, బెంగళూరుతో పోల్చితే హైదరాబాద్‌లో మెట్రో కనెక్టవిటీ తక్కువగా ఉన్నందున మెట్రో ఫేజ్-2 కింద ఆరు కారిడార్లను గుర్తించామని ముఖ్యమంత్రి వివరించారు.

ఆరింటిలో తొలి అయిదు కారిడార్లకు సంబంధించి (76.4 కి.మీ.) డీపీఆర్లు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ. 24,269 కోట్లు వ్యయమ వుతుందన్నారు. డీపీఆర్లు ఆమోదించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యం (జేవీ) కింద చేపట్టి నిధులు కేటాయించాలని కోరారు.

గృహ నిర్మాణం, పట్టణ ప్రణాళికలపై కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ గారు హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ప్రొటోకాల్, ప్రజాసంబంధాల సలహాదారు హర్కార వేణుగోపాల్ , మల్కాజిగిరి లోక్‌సభ సభ్యులు ఈటల రాజేందర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు అంశాలను కేంద్ర మంత్రి గారి దృష్టికి తెచ్చారు.

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు కేంద్రం చేయూతనివ్వాలి. మూసీలో మురుగు చేరకుండా నదికి ఇరువైపులా 55 కి.మీ. (మొత్తంగా 110 కి.మీ.) కాలువలు, బాక్స్ డ్రెయిన్లు, ఎస్టీపీల నిర్మాణానికి అయ్యే రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలి.హైదరాబాద్ నగరంతో పాటు సమీపంలోని 27 పట్టణ పాలక సంస్థల పరిధిలో మురుగు నీటి నెట్‌వర్క్ నిర్మాణానికి రూ.17,212 కోట్లతో సమగ్ర మురుగునీటి మేజర్ ప్లాన్ (సీఎస్ఎంపీ) కు నిధులివ్వాలి. తెలంగాణ రాష్ట్రంలో రెండో పెద్ద నగరమైన వరంగల్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను నోటిపై చేసింది. వరంగల్ నగరంలో రూ. 41,70 కోట్లతో సమగ్ర భూగర్భ నీటి పారుదల (యూజీడీ) పథకాన్ని చేపట్టేందుకు నిధులు కేటాయించాలి.

తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన రైతులకు నిరంతరం సాగు నీరు అందించేందుకు వీలుగా పీఎం కుసుమ్ కింద లక్ష సౌర పంపులు కేటాయించాలి.విద్యుత్ సరఫరా, నెట్‌వర్క్ బలోపేతానికి రూ.488 కోట్ల అంచనా వ్యయంతో 9 ప్రాజెక్టు నివేదికలను సమర్పించాం. వెంటనే మంజూరు చేయాలి. రాష్ట్ర విద్యుత్ సంస్థలకు విద్యుత్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ (ఆర్ఈసీ) ఇచ్చిన రుణాలకు సంబంధించిన వడ్డీ రేట్లను తగ్గించాలి.కొత్త పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి రెండు సంవత్సరాలకు పైగా సమయం పడుతుంది. అందువల్ల ఆర్‌పీపీవో లక్ష్యాలను చేరుకోలేకపోయినందుకు విధించే జరిమానాలు మాఫీ చేయాలన్నారు.

### సీఎంకు కేంద్ర మంత్రి అభినందనలు



దావోస్ వేదికగా తెలంగాణ రాష్ట్రానికి రూ. 1.78 లక్షల కోట్లు పెట్టుబడులు సాధించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అభినందించారు. ప్రధానమంత్రి గారు దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలంటున్నారని, అందులో తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు కేంద్ర మంత్రికి వివరించారు.

## సివిల్ సర్వీసెస్ పరీక్షలకు కొత్త నిబంధన




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఇటీవల ప్రకటించిన నిబంధనల ప్రకారం, యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ పరీక్షలకు దరఖాస్తు చేసేటప్పుడు అభ్యర్థులు వయస్సు నిర్ధారణ, రిజర్వేషన్ సంబంధిత పత్రాలు సమర్పించడాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది. ఇంతకు ముందు అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షకు అర్హత సాధించిన తరువాత అటువంటి పత్రాలను అప్‌లోడ్ చేస్తుండేవారు. ఐఎఎస్ మాజీ ప్రొబేషనర్ పూజా ఖేడ్కర్‌కు సంబంధించిన వివాదం నేపథ్యంలో కేంద్రం ఈ నిబంధన తీసుకువచ్చింది. ప్రభుత్వ ఉద్యోగంలో తన ఎంపికకోసం పూజా ఖేడ్కర్ వంచనకు పాల్పడిందని, ఒబిసి, దివ్యాంగుల కోటా ప్రయోజనాలను తప్పుగా పొందిందని ఆరోపణలు వచ్చిన విషయం విదితమే. అయితే, ఆమె ఆ ఆరోపణలు అన్నిటినీ ఖండించింది. ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ వంటి సర్వీసుల్లో అధికారుల ఎంపిక నిమిత్తం ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశల్లో సివిల్ సర్వీసెస్ పరీక్షలను యుపిఎస్‌సి ఏటా నిర్వహిస్తుంటుంది.

'సివిల్ సర్వీసెస్ పరీక్షకు దరఖాస్తు చేయాలని సంకల్పిస్తున్న అభ్యర్థి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి, ఆన్‌లైన్ దరఖాస్తు పత్రంతో పాటు కమిషన్ కోరే జనన తేదీ, కేటగరీ (ఎస్‌సి/ ఎస్‌టి/ ఒబిసి/ ఇడబ్ల్యుఎస్/ పిడబ్ల్యుబిడి/ మాజీ సైనికులు), విద్యార్హత, సర్వీస్ ప్రాథమ్యం మొదలైనవాటి క్లెయిముల దిశగా సమర్థన పత్రాలను సమర్పించాలి' అని బుధవారం (22) నాటి సివిల్ సర్వీసెస్ పరీక్ష నిబంధనావళి 2025 స్పష్టం చేసింది. పేరు నమోదు, ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు కావలసిన సమాచారం/ పత్రాలు సమర్పించకపోతే పరీక్షకు అభ్యర్థిత్వం రద్దు అవుతుందని ఆ ప్రకటన స్పష్టం చేసింది. 2025 సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను మే 25న నిర్వహించనున్నట్లు యుపిఎస్‌సి ఒక ప్రకటనలో తెలియజేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తును ఫిబ్రవరి 11 సాయంత్రం 6 గంటల వరకు దాఖలు చేయవచ్చునని యుపిఎస్‌సి తన ప్రకటనలో సూచించింది.

## ఏపీకి గోదావరి నీళ్లు... రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది..?




- తెలంగాణ ఉద్యమ నినాదమే నీళ్లు, నిధులు, నియామకాలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

గోదావరి నీళ్లను ఏపీకి తీసుకెళ్తుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నదే నీళ్ల, నిధులు, నియామకాల కోసం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి విషయంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గోదావరి నీళ్లను పెన్నాకు తీసుకెళ్లేందుకు ఏపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది అని హరీశ్‌రావు తెలిపారు. గోదావరి నీళ్లను ఏపీకి తీసుకెళ్తుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది..? బనకచర్ల ఆపాలని ఏపీకి కనీసం లేఖ కూడా రాయలేదు సీఎం రేవంత్ రెడ్డి. నాలుగు ప్రాజెక్టులకు నీళ్ల కేటాయింపులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టులకు అనుమతుల సాధనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. బనకచర్లకు నిధుల కోసం చంద్రబాబు కేంద్రానికి లేఖలు రాశారు. చంద్రబాబు లేఖపై కేంద్రంలో దస్త్రం కదులు తోంది. చంద్రబాబు నవంబర్‌లో లేఖ రాస్తే సీఎం రేవంత్ ఏం చేశారు..? బనకచర్లపై ఏపీ ముందుకెళ్తుంటే సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు..? బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుంది. బనకచర్లపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది అని హరీశ్‌రావు మండిపడ్డారు.

కృష్ణా జలాల విషయంలో సెక్షన్ 3ని సాధించిందే కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని హరీశ్‌రావు తెలిపారు. ఇప్పుడు సెక్షన్ 3పై ఏపీ సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఏపీ సుప్రీంకోర్టుకు వెళ్తే కనీసం కేవియట్ వేయరా..? ప్రభుత్వాన్ని అధికారులు సరిగ్గా మార్గదర్శకత్వం చేయట్లేదు. మంచి అడ్వకేట్లను పెట్టి సెక్షన్ 3 విషయంలో వాదించాలి కదా..? సాగునీటి మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి విఫలమయ్యారు. మేడిగడ్డను పండబెట్టారు.. పాలమూరును పక్కకు పెట్టారు. ఇప్పటికైనా నదీ జలాలపై రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి. అఖిలపక్షం వేస్తే సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

ఏపీ మాజీ సీఎస్ ఆదిత్యానాథ్‌ను సలహాదారుగా పెట్టుకున్నారు. ఆదిత్యానాథ్ విషయంలో రేవంత్ గురుదక్షిణ చెల్లించారేమో..? తుంగభద్రను గండికొట్టేందుకు ఏపీ, కర్ణాటక యత్నాలు చేస్తున్నాయి. ఏపీ, కర్ణాటక తుంగ భద్రకు గండి కొడుతుంటే సీఎం ఏం చేస్తున్నారు..? 2017లో ఏపీ ఇలాంటి ప్రయత్నం చేస్తే గట్టిగా అడ్డుకున్నాం అని హరీశ్‌రావు గుర్తు చేశారు.


## మేడ్చల్‌లో యువతి దారుణ హత్య

బలగం టీవి, హైదరాబాద్

గుర్తుతెలియని యువతి దారుణ హత్యకు గురైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మునీరాబాద్ సమీపంలో ఔటర్‌రింగు రోడ్డు కల్వర్టు కింద 25 ఏండ్ల యువతి హత్యకు గురైనట్టు గుర్తించిన స్థానికులు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో మహిళను దుండగులు బండరాయితో తలపై మోదీ హత్యచేసి, ఆ తర్వాత మృతదేహాన్ని గుర్తుపట్టకుండా ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పటించినట్టు తేల్చారు. యువతి చేతులపై శ్రీకాంత్, నరేందర్, రోహిత్ అని టాటూలు ఉన్నట్టు గుర్తించారు. ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

## కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్ హయాంలో నష్టం జరిగింది

- హరీష్‌రావు అబద్ధాలు మాట్లాడుతున్నారు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి హరీష్‌రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, హరీష్ రావు అసమర్థత కారణంగా తెలంగాణ తీవ్రంగా నష్ట పోయిందని చెప్పారు. కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్ హయాంలో నష్టం జరిగిందని అన్నారు. కాళేశ్వరం కూలితే కనీసం తెలంగాణ ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదన్నారు. శుక్రవారం నాడు తెలంగాణ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ... ఐఏఎస్ అధికారుల గురించి చిల్లరగా మాట్లాడవద్దని చెప్పారు. హరీష్‌రావు చిల్లర రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. వాళ్ల హయాంలో ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా కేటాయింపులు చేయలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

"లక్ష కోట్లతో కాళేశ్వరం కడితే ఏమైంది.. వాళ్ల టైంలో కట్టింది.. వాళ్ల హయాంలోనే కూలింది. గోదావరి - బనకచర్ల కట్టినట్లు ఏపీ నీళ్ల తీసుకెళ్లినట్లు హరీష్‌రావు పచ్చి అబద్ధాలు చెబుతున్నాడు. బనకచర్ల విషయంలో మేము చాలా అలెర్ట్‌గా ఉన్నాం. కేంద్ర మంత్రి సీ ఆర్. పాటిల్‌కు లేఖ రాశాం. ఆ ప్రాజెక్టుకు మేము వ్యతిరేకం అని స్పష్టం చేశాం. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఆ ప్రాజెక్టు సరైంది కాదని స్పష్టం చేశాం. మేము నిర్మలా సీతారామన్‌కు కూడా లేఖ రాశాం. కృష్ణా ట్రిబ్యునల్‌కు స్వయంగా మంత్రిగా నేను హాజరై.. నీటి లెక్కలను సరి చేసే ప్రయత్నం చేశా. తెలంగాణకు 70 శాతం అడగాల్సి ఉంటే.. కేవలం 33 శాతానికి ఒప్పుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో కృష్ణా నీటిలో మోసం, దగా జరిగింది. జీవో 203 ద్వారా పోతిరెడ్డి పాడు ద్వారా 790 అడుగుల నుంచే నీటిని తీసుకెళ్తుంటే.. ప్రగతి భవన్‌లో జగన్‌తో విందులు చేసుకున్నారు. తెలంగాణ రాక ముందు..కంటే.. తెలంగాణ వచ్చాక పోతిరెడ్డి పాడు నుంచి ఎక్కువ నీటిని తీసుకెళ్లారు. ఇది వారి వైఫల్యం కాదా..? అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌ను.. రాయలసీమ లిఫ్ట్ టెండర్ల కోసం వాయిదా వేసిన ఘనత కేసీఆర్‌ది" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు.

## ఆ సమయంలో సినిమా షోలు వద్దు

- అర్ధరాత్రి 1.30 నుంచి ఉదయం 8.40 వరకు షోలకు అనుమతి ఇవ్వవద్దని హైకోర్టు సూచన
- తదుపరి విచారణ వచ్చే నెల 21కి వాయిదా

బలగం టీవి, హైదరాబాద్



తెలంగాణలో బెనిఫిట్ షోలకు అనుమతులపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వం సినిమాటోగ్రఫీ చట్టం ప్రకారం నడుచుకోవాలని అర్ధరాత్రి 1.30 గంటల నుంచి ఉదయం గం.8.40 మధ్య ఎలాంటి షోలకు అనుమతి ఇవ్వవద్దని చెప్పింది. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెల 21కి వాయిదా వేసింది.

సినిమా టిక్కెట్ల ధరల పెంపు, ప్రత్యేక షోలకు అనుమతులపై దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... సినిమా టిక్కెట్ ధరలను పెంచుతూ ఇచ్చిన అనుమతులను రద్దు చేసినట్లు తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం... సినిమాటోగ్రఫీ చట్టం ప్రకారం నడుచుకోవాలని సూచించింది. ఈ చట్టం ప్రకారం అర్ధరాత్రి 1.30 గంటల నుంచి ఉదయం గం.8.40 మధ్య ఎలాంటి షోలకు అనుమతి ఇవ్వవద్దని, ఈ చట్టాన్ని అనుసరించాలని వ్యాఖ్యానించింది.

## రూ.5 లక్షల విలువైన నకిలీ నోట్లు స్వాధీనం

- రాచకొండ కమిషనరేట్‌లో ఘటన

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో నకిలీ నోట్లు కలకలం సృష్టించాయి. రాచకొండ కమిషనరేట్ పరిధిలో దొంగనోట్లను ముద్రిస్తున్న నిందితుడిని ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ, మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ, పహాడీషరీఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి ఐదులక్షల విలువగల ( నకిలీ రూ.500)నోట్లతోపాటు నోట్ల తయారీకి ఉపయోగించే పేపర్‌తోపాటు ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో సీపీ సుధీర్‌బాబు తెలిపిన వివరాల మేరకు ...

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కే.నవీన్‌కుమార్ మల్టీమీడియా, గ్రాఫిక్ డిజైన్ కోర్సు చదివాడు. ఉద్యోగం కోసం గాలించిన నిందితుడు 2023లో ఊబర్, ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేశాడు. అయితే అందులో ఆశించినంత సంపాదన లేకపోవడంతో తన అనుభవంతో దొంగనోట్లు తయారు చేయాలని పథకం వేశాడు. నకిలీనోట్లు తయారు చేసేందుకు కావాల్సి పేపర్, కెమికల్స్, కలర్స్ ఎక్కడు లభిస్తాయో వెబ్‌సైట్‌లో సెర్చ్‌చేశాడు. కర్నూల్‌లో ఓ స్నేహితున్ని సంప్రదించిన నిందితుడు నకిలీనోట్ల తయారు చేసేందుకు ఒప్పించాడు. అతని నుంచి కంప్యూటర్, కలర్ ప్రింటర్ తీసుకున్నాడు. కోల్‌కత్తాకు వెళ్లి పేపర్స్, కలర్స్‌ను కొనుగోలు చేశాడు. వాటి సహాయంతో నకిలీనోట్లను తయారు చేస్తున్న నిందితులు మార్కె ట్‌లో సరఫరా ఛెలామని చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌వోటీ బృందాలు నిందితుడిపై ప్రత్యేక నిఘా వేశారు. తక్కుగూడ సమీపంలో నకిలీ నోట్లు మార్చేందుకు ప్రయత్నిస్తున్న నిందితున్ని పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసునమోదు చేశారు. డీసీపీ కే.మురళీధర్, ఎస్‌వోటీ బృందాలు, పహాడీషరీఫ్ పోలీసులు పాల్గొన్నారు.


## ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి బీఆర్ఎస్ రూ. లక్ష సాయం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న గుడిహత్నూర్ మండలంలోని నేరడిగొండ తాండ గ్రామానికి చెందిన ఆడే గజానంద్ రైతు కుటుంబాన్ని శుక్రవారం బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ పరామర్శించింది. బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నియమించిన కమిటీ ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే అని అన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తన నియోజకవర్గంలో ఆత్మహత్య చేసుకున్న రైతు ఆడే గజానంద్ కుటుంబానికి సొంత డబ్బులు రూ. లక్ష ఆర్థిక సాయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అందజేశారు.

# ప్రభుత్వంపై వ్యతిరేకత బాగా పెరిగిపోయింది

- **బీఆర్ఎస్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్**



**బలగం టీవి, సిరిసిల్ల**

ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత బాగా పెరిగిపోయిందని గ్రామసభల్లో నిరసనలు, నిలదీతలే నిదర్శనమని బీఆర్ఎస్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా కౌన్సిలర్లను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 400 రోజులు గడుస్తున్న హామీల అమలు మాత్రం మర్చిపోయారన్నారు. 1.67 కోట్ల ఆడబిడ్డలు మహాలక్ష్మి పథకం ద్వారా 2500 రూపాయల కోసం ఎదురి చూస్తున్నారన్నారు. తులం బంగారం కోసం ఎదురుచూస్తున్నారని, 4 వేల పింఛన్ ఎప్పుడు పడుతుందో అని ఎదురుచూస్తున్నారన్నారు. రైతుబంధు 15000 ఎప్పుడు పడుతుందని రైతులు కళ్ళల్లో వత్తులు పెట్టుకొని ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. సీఎం 100% రుణమాఫీ అయిందని దొంగ మాటలు చెబుతున్న ఆయన ప్రభుత్వంలోని మంత్రి మాత్రం రుణమాఫీ పూర్తిగా జరగలేదని చెప్పడమే రుణమాఫీ జరగలేదని చెప్పేందుకు నిదర్శనమన్నారు.కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం గాల్లో తిరుగుతూ ఇప్పటికీ గాలి మాటలే మాట్లాడుతున్నారన్నారు. ఏడాది పాలనలో ఒక్క ఇటుక కూడా పెట్టలేదని 1.40 లక్షల కోట్ల అప్పు మాత్రం చేశారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేకుండా పోయాయని, ప్రతిరోజు ఆడపిల్లలపై దాడులు జరుగుతున్నాయన్నారు.

శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు వాటిని మార్చి సోషల్ మీడియాలో హామీల అమలు కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తున్న వారి పై కేసులు నమోదు కోసం ఆరాటపడుత ఎన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క నిరుద్యోగులనే కాదు అన్ని వర్గాలను మోసగించారన్నారు. కేవలం అధికారం మాత్రమే కోల్పోయామని ప్రజాభిమానాన్ని మాత్రం కోల్పోలేదన్నారు. అయినా మంచే జరిగిందని ప్రజలకు కూడా కేసీఆర్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ మోసపూరిత పాలన ను బేరీజు వేసుకునే అవకాశం వచ్చిందన్నారు.

పదవీకాలం ముగిసినా కౌన్సిలర్లు అందరూ ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. 2014 ముందు సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు ఎలా ఉన్నాయో ప్రస్తుతం ఎలా ఉన్నాయో ప్రజలు గమనించాలన్నారు. రాష్ట్రంలోని 142 మున్సిపల్ పట్టణాలను తమ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేశామన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత బాగా పెరిగిపోయిందని గ్రామసభల్లో నిరసనలు, నిలదీతలే నిద ఎన్నికలు వస్తాయో కెసిఆర్ ను మళ్ళీ ముఖ్యమంత్రి చేసుకుందామని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. మోసపూరిత ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, వేములవాడ ఇన్చార్జ్ చెలమడ లక్ష్మీనరసింహారావుతోపాటు బారాస ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# 28 నుంచి నాగోబా జాతర ఉత్సవాలు

**బలగం టీవి, ఆదిలాబాద్**



ఆదిలాబాద్ జిల్లా కెస్లాపూర్ లో కొలువైన ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా జాతర ఉత్సవాలను ప్రభుత్వ పండుగగా గుర్తించింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుషఘ్న గుప్తా, ఎస్పీ గౌస్ అలం, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ నాగోబా ఆలయాన్ని దర్శించుకుని జాతర ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుండి తరలివచ్చే భక్తుల కోసం ఘనంగా ఏర్పాట్లు ఉండాలని, లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖలను సమన్వయం చేయాలని సూచించారు. నాగోబా జాతర ఉత్సవాలను ఆదివాసీలు సంప్రదాయ, ఆచార వ్యవహారాలతో నిర్వహించనున్నారు. ఇప్పటికే పవిత్ర గోదావరి జలాన్ని కాలినడకన తీసుకొని వచ్చిన మెస్రం వంశస్థులు శనివారం కేస్లాపూర్ కు చేరుకోనున్నారు. రేపటి నుండి మూడు రోజులపాటు తూమ్ పూజలు నిర్వహించి, 28వ తేదీన రాత్రి పది గంటలకు మహా పూజ తో జాతర ఉత్సవాలు ప్రారంభంకా నున్నాయి. ఆదివాసీలు తీసుకువచ్చిన పవిత్ర గంగాజలాలతో నాగోబాను అభిషేకించనున్నారు. ఈ జాతర ఉత్సవాలకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో గిరిజనులు తరలిరానున్నారు.

# దిల్ రాజు ఆఫీస్‌లో ఐటీ రైడ్స్

- **నాలుగో రోజూ కొనసాగిన తనిఖీలు**

**బలగం టీవి, హైదరాబాద్**

సినీ పరిశ్రమలోని అగ్ర నిర్మాణ సంస్థలపై ఐటీ అధికారుల సోదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వరుసగా నాలుగు రోజుల నుంచి ప్రముఖ నిర్మాత దిల్ రాజుతో పాటు మైత్రీ మూవీ మేకర్స్ సంస్థపై ఐటీ అధికారులు తనిఖీలు చేస్తూనే ఉన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్యే కాలనీలోని దిల్ రాజు నివాసంలో తనిఖీలు ముగించిన ఐటీ అధికారులు, తమ వాహనంలోనే దిల్ రాజును సాగర్ సొసైటీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ కార్యాలయానికి తీసుకెళ్లారు. సినిమాల ఆర్థిక లావాదేవీలు, పన్ను చెల్లింపులకు సంబంధించిన డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అనుమానం ఉన్న వివరాలపై అక్కడే ఉన్న దిల్ రాజుతోపాటు అతని సోదరుడు శిరీష్, ఇతర ముఖ్య సిబ్బందిని ఆరా తీస్తున్నారు. మరోటు మైత్రీ మూవీ మేకర్స్ సంస్థలో కూడా సోదాలు ఆగడం లేదు. భారీ బడ్జెట్ చిత్రాల నిర్మాణ సంస్థగా పేరున్న మైత్రీలో పెట్టుబడులు, ఆదాయ వ్యయాలతో పాటు ప్రతి సినిమాకు పన్ను చెల్లింపులపై సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు. అనుమానం ఉన్న వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు.

# తెలంగాణ కంపెనీలనే దావోస్ తీసుకెళ్లి ఒప్పందాలు చేసుకున్నారు



- **కాంగ్రెస్ ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలను వేధిస్తోంది**
- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. తెలంగాణ కంపెనీలనే దావోస్ కు తీసుకెళ్లి అక్కడ ఎంవోయూలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ విధానం తనకు ఏమీ అర్థం కాలేదని అన్నారు. విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి పెట్టుబడులు రావాలని చెప్పారు. దావోస్ లో చేసుకున్న ఒప్పందాలు కేవలం పేపర్లకే పరిమితం కాకూడదని... క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభం కావాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొందరు వ్యాపారవేత్తలపై పక్షపాతం చూపిందని... ఈ ప్రభుత్వం అందరినీ వేధిస్తోందని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేధించని పారిశ్రామికవేత్త ఒక్కరు కూడా లేరని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను వేధిస్తోందని ఆరోపించారు. అందుకే పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారని ఆయన అన్నారు.

నెహ్రూ కుటుంబం మాత్రమే దేశాన్ని పాలించాలన్న విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అసలు కాంగ్రెస్ ఎప్పుడూ రాజ్యాంగబద్ధంగా దేశాన్ని పాలించలేదని.. అలాంటిది, రాజ్యాంగ గురించి రాహుల్ గాంధీ మాట్లాడటం విడ్డూరంగా ఉందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని చాలాసార్లు కాంగ్రెస్ పార్టీ దుర్వినియోగం చేసిందని సికింద్రాబాద్ ఎంపీ ఆరోపించారు.

మదర్ ఆఫ్ డెమొక్రసీ అంటే భారత్ అని మోదీ చెప్పారని ఆయన అన్నారు. అంబేద్కర్ జీవించి ఉన్నంతకాలం కాంగ్రెస్ ఆయన్ని అవమానించిందని చెప్పుకొచ్చారు. కుటుంబ పాలనకు కేంద్రంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని అన్నారు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉండి ఎమర్జెన్సీ విధించినప్పుడు దేశంలో ఓ నిశబ్ద యుద్ధమే జరిగిందని కిషన్ రెడ్డి అన్నారు.

# అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులకు ఎంపికైన వారి ప్రొవిజినల్ లిస్ట్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

అసిస్టెంట్ సివిల్ ఇంజినీర్ ఉద్యోగాలకు ఎంపికైన వారి ప్రొవిజినల్ జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఈ మేరకు ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ప్రొవిజినల్ లిస్ట్?ను టీజీపీఎస్సీ వెబ్?సైట్?లో అందుబాటులో ఉంచింది. వివిధ శాఖల్లో సివిల్ విభాగంలో ఖాళీలను భర్తీచేసేందుకు 650 పోస్టులకు గతంలో టీజీపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే.

# ఫిబ్రవరి 5న టెట్ ఫలితాలు

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టిజి టెట్) ఫలితాలు ఫిబ్రవరి 5వ తేదీన విడుదల కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 2న ప్రారంభమైన టెట్ పరీక్షలు ఈ నెల 20 వరకు పది రోజుల పాటు 20 సెషన్లలో నిర్వహించారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రిమిలినరీ కీ, రెస్పాన్స్ షీట్లను అధికారులు శుక్రవారం విడుదల చేశారు. పేపర్ల వారీగా ప్రాథమిక కీ ని అధికారులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. టెట్ ప్రాథమిక కీ లపై అభ్యంతరాలు తెలియజేసేందుకు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ తుది కీ ఖరారు చేయనున్నారు. టెట్ పరీక్షలకు మొత్తం 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 2,05,278 మంది(74.44 శాతం) హాజరయ్యారు. టెట్ పేపర్ 1కు 94,327 మంది దరఖాస్తు చేసుకోగా, 69,476 మంది(73.65 శాతం) హాజరు కాగా, పేపర్ 2 మ్యాథ్స్ అండ్ సైన్స్‌కు 93,263 మంది దరఖాస్తు చేసుకోగా, 69,390 మంది(74.40 శాతం), పేపర్ 2 సోషల్ స్టడీస్‌కు 88,163 మంది దరఖాస్తు చేసుకోగా, 66,412 మంది(75.33 శాతం) హాజరయ్యారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కోడిగుడ్లు, టమోటాలతో దాడి

- **ఎమ్మెల్యే కాన్వాయ్‌పై చెప్పులు విసిరేసిన కాంగ్రెస్ నాయకులు**

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రభుత్వ పథకాలకు లబ్దిదారులను ఎంపిక చేసేందుకు ఏర్పాటుచేసిన కమలాపూర్ గ్రామసభ రసాభాసగా మారింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు పరస్పరం దాడులు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కోడిగుడ్లు, టమోటాలు విసరడంతో అప్పటి వరకు ప్రశాంతంగా జరుగుతున్న గ్రామసభలో ఏం జరుగతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే.. కమలాపూర్ మండల కేంద్రంలో నిర్వహించే గ్రామ సభకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాజరయ్యారు. స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో గుండె బాబు ప్రభుత్వ పథకాల లబ్దిదారుల జాబితాను చదువుతుండగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అడ్డుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి సంవత్సరం గడుస్తున్నా ఇవ్వడంలేదని, సుమారు 1700 మందిలో 20 మందికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో లబ్ది చేకూరడం కోసం ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. దాంతో కాంగ్రెస్ నాయకులువేదిక మీదికి దూసుకువెళ్లేందుకు ప్రయత్నించడంతో భారీగా మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ నాయకులూ ఎమ్మెల్యేపై ఎదురుదాడికి దిగారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రజలను మోసం చేసిందని, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రేషన్ కార్డులు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. దాంతో ఇరు పార్టీల మధ్య తోపులాట జరిగింది. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేయడంతో బీఆర్ఎస్ నాయకులు కుర్చీలు పట్టుకొని కాంగ్రెస్ నాయకులపైకి వెళ్లడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు టమాటాలు, కోడిగుడ్లతో దాడులు చేశారు. దాంతో రసాభాసగా మారింది.

# మంత్రి ఉత్తమ్ కాన్వాయ్‌లో ప్రమాదం

**బలగం టీవి, హైదరాబాద్**



తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాన్వాయ్‌లో వాహనాలకు ప్రమాదం జరిగింది. కాన్వాయ్‌లు ఒకదానితో ఒకటి స్వల్పంగా ఢీకొన్నాయి. ఎనిమిది వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. హుజూర్‌నగర్ నుంచి జాన్‌పహాడ్‌లోని ఉర్సు ఉత్సవాలకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మంత్రి ప్రమా దం తప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకు న్నారు. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు.

## సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయండి




- పార్టీ మండల శాఖ పిలుపు

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభల పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. పార్టీ మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ: శనివారం మండలం నుండి అన్ని రంగాల కార్మికులు సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర మహాసభలను పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అనుముల రవి, కడుదుల రవి, ఆవుల మల్లయ్య, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

**బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో పలువురు వ్యక్తులు వివిధ కారణలతో మృతి చెందగా వారి కుటుంబాలకు బంగ్లా ధర్మ గౌడ్ ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచాడు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ బి, అల్లెపు మరియమ్మ, షేక్ రషీద్, వాసరి బాలయ్య, బండి స్వామి గౌడ్ లు వివిధ కారణాలతో మృతిచెందగా వారి కుటుంబానికి ఒక్కొక్కరికి 25 కిల్లోల బియ్యంతో పాటు ?2000 నగదును వారి కుటుంబ సభ్యులకు ఒక్కరికి అందించి అండగా నిలిచి ఔదరి అని చాటుకున్నారు. ఈ సందర్భంగా ధర్మ గౌడ్ మాట్లాడుతూ... మా గ్రామానికి చెందిన ఐదురు వ్యక్తులు మూడు నెలల కాలంలో ఒక్కొక్కరికి ఒక్కొక్క సమస్య ద్వారా చనిపోవడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతుకు గురిచేస్తూ బాధాకరమైన సంఘటనని ఆయన దిబ్బంతి గురయ్యాడు. కడు నిరుపేద కుటుంబాల చెందిన వీరు చనిపోవడం పట్ల వారి కుటుంబాలకు తీరని లోటుఅని ఆయన గుర్తు చేశారు.మా తండ్రి గారి జ్ఞాపకార్థం బంగ్లా వెంకటయ్య గారి జ్ఞాపకార్థం ఇప్పటివరకు చాలా కుటుంబాలకు ఆర్థిక సాయం అంచడమే కాకుండా ఇంకా ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తూ వాళ్ళ కుటుంబాలకు అండగా ఉంటానని ధర్మ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కెకె మహేందర్ రెడ్డి

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండలం ఇందిరమ్మ కాలనిలో గురువారం రోజున గ్రామసభ అధికారులు నిర్వహించగా గ్రామానికి చెందిన జక్కానీ మహేష్ కార్యక్రమంలో పాల్గొని అనంతరం ఇంటికి వెళ్లే దారిలో గుండె పోటు తో మరణించగా వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి, తాహశిల్దార్ జయంత్ కుమార్ పరామర్శించి ప్రభుత్వపరంగా మంజూరైన 50 వేల రూపాయల చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ (టోనీ), ఏఎంసి డైరెక్టర్ ఇట్టిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,బైరినేని రాము,మాజీ సర్పంచ్ బైరి శ్రీవాణి రమేష్, జిల్లా కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షుడు మునిగేలా రాజు,గుగ్గిళ్ళ భరత్ గౌడ్,గడ్డం మధుకర్ చోటు,భాగ్య,తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం..

- త్వరలో రేషన్ కార్డుల ద్వారా ప్రతి లబ్ధిదారుడికి 6 కిలోల సన్నబియ్యం సరఫరా
- పథకాల అమలు పట్ల ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**బలగం టీవీ, వేములవాడ**

పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . వేములవాడ రూరల్ మండలం వెంకటంపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమనీకి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఈ నెల 26 వ తేదీ నుండి ప్రారంభంకానున్నదని అన్నారు . గత పది సంవత్సరాలుగా ప్రజలు కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందని అన్నారు .

జనవరి 26 నుండి రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రైతు భరోసా కింద రూ. 12 వేలు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఇస్తామని,దేశంలో ఎక్కడా లేనివిధంగా భూమిలేని నిరుపేద కూలీలకు రూ. 12 వేలు ఇస్తామని అన్నారు .ప్రజా పాలన సమయంలో దరఖాస్తు చేయలేని వారు ప్రత్యేకంగా గ్రామ సభలలో దరఖాస్తు చేసి పోర్టల్లో నమోదు చేయడం జరుగుతుందని, గ్రామ,వార్డు సభల్లో అధికారులు ఓపిగ్గా ఉంటూ ప్రజలందరికీ సహాయ సహకారాలు అందించాలని అన్నారు.

నాలుగు గోడల మధ్య దరఖాస్తులు పరిశీలించకుండా ప్రజల మధ్య చర్చించి నిజమైన అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు..అర్హులను ఏ ఒక్కరికి కూడా అన్యాయం జరగదాని,గతంలో ఆనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఇందిరమ్మ ప్రభుత్వన్నీ మీరు ఆశీర్వాదలు అందజేశారనీ అన్నారు.. శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో ఫాజిల్ నగర్, చందుర్తి ప్రాజెక్టుల నిర్మాణం 2009 మునుపే మన ప్రాంతంలో అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నాం అన్నారు.. గత పది సంవత్సరాలుగా పడవు పడ్డా ప్రాజెక్టులను మీ బిడ్డా పూర్తి చేస్తున్నాడనీ అన్నారు ..

గెలిచిన సంవత్సరం లోనే మల్రిపల్లి ప్రాజెక్ట్ పనులను ప్రారంభం చేసుకున్నాం ఆ ప్రాజెక్ట్ పూర్తి అయితే మన ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగి సాగు, త్రాగు నీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.. ఆనాడు ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించాలని అనేక పథకాలను అమలు చేయడం జరిగిందనీ అన్నారు . ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం దేశంలో ఎక్కడ లేని విధంగా అమలు చేయడం జరుగుతుందన్నారు..పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే కొందరు వాటిని చూసి ఓర్వలేక ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని గత పది సంవత్సరాల లో కనీసం ఒక పేదవాడికైనా రేషన్ కార్డు ఇచ్చిన పాపన పోలేదన్నారు...

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనలో 1 లక్ష 79 వేల కోట్లు పెట్టుబడులను తీసుకువచ్చారని దాని ద్వారా 40,000 పై చిలుకు ఉద్యోగాలు లభిస్తాయి అని అన్నారు .. రానున్న రోజుల్లో మన ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని హామీ ఇచ్చారు..

## అభివృద్ధిపై దృష్టి పెడితేనే నాయకులకు దీర్ఘకాలిక గుర్తింపు...

**ఎన్నికల్లప్పుడే రాజకీయం చేస్తే బాగుంటుంది : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ , వేములవాడ**

నాయకులకు స్ఫూర్తిగా ఉండాలే తప్పితే అధికారమే పరమావధిగా భావించవద్దని,ప్రజా జీవితంలో ఉన్న వారు తప్పనిసరిగా నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటేనే గుర్తింపు ఉంటుందని ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశనికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై,మాట్లాడుతూ నాయకులకు మంచి, చెడులతో పాటు మంచి నడవడిక చాలా ముఖ్యమని అన్నారు.1995 నుండి ఇప్పటివరకు ఏ స్థానంలో కూర్చున్న ప్రజా సమస్యలపై ప్రశ్నించడం మానలేదని, ఏ స్థానంలో ఉన్న ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేవాడిని అన్నారు.ఆ కాలంలోనే జడ్పీటీసీ గా రూ.60కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడం జీవితంలో గుర్తుండిపోయే ఘట్టమని,నా రాజకీయ జీవితంలోనూ ఎన్నో మధుర స్మృతులు ఉన్నాయని అన్నారు.నాకున్న 4ఏండ్ల ఎమ్మెల్యే కాలంలో వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాను అని అన్నారు.రాబోయే రోజుల్లోనూ వేములవాడ పట్టణాన్ని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు.విజయవంతంగా 5ఏండ్ల పాలన పూర్తి చేసుకున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు శుభాభినందనలని,5 సంవత్సరాలగా మీకు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించి ప్రజలకు మీరు చేసిన సేవలు మరొకరికి స్ఫూర్తి గా నిలవాలని అన్నారు. పెరిగిపోతున్న పట్టణనికి అనుగుణంగా వేములవాడ అభివృద్ధి చేస్తానని అన్నారు.ప్రతీ నిత్యం రాజకీయలు చేసే కంటే అభివృద్ధి కోసం ఆలోచన చేయడం మేలు అని ,మళ్ళీ రానన్న రోజుల్లో మీరు ప్రజా సేవలో ఉండాలని అన్నారు.అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియని,ప్రజా పతినిదులకు ప్రజల మధ్య ఉంటేనే గుర్తింపు అని అన్నారు.మీ మీ వార్డుల్లో మిగిలిన పనులు ఉంటే నాకు చెప్పండని, రాజకీయాలకు అతీతంగా మన ప్రాంత అభివృద్ధి చేసుకుందామని అన్నారు.రానున్న రోజుల్లో వేములవాడ పట్టణంతో,పాటు నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని అన్నారు. ప్రజా పాలన ద్వారా ఇందిరమ్మ ఇల్లు,నూతన రేషన్ కార్డులు , ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా లను ఈ నెల 26 నుండి అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రతినిధులు పదవి లేకున్నా మీకు ఉన్నా అనుభవాలను ఉపయోగించి ప్రజలకు అండగా ఉండాలని అన్నారు.

## కిడ్నీ రాకెట్‌పై సీఐడీ చేత విచారణ

**బలగం టీవీ , హైదరాబాద్**

హైదరాబాద్ సరూర్ నగర్ లోని అలకనంద ఆసుపత్రిలో వెలుగు చూసిన 'కిడ్నీ రాకెట్' కేసును తెలంగాణ ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని దామోదర రాజనర్సింహ కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వం చాలా సీరియస్‌గా పరిగణిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, ఈ రాకెట్‌లో ఉన్న ప్రతి ఒక్కరినీ పట్టుకోవాలన్నారు. దోషులకు చట్టప్రకారం శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరొకరు ఇలాంటి పని చేయాలంటేనే వణికిపోవాలన్నారు.

# ఐసీసీ టెస్టు టీమ్ ఆఫ్ ది ఇయర్...

- **టీమ్ఇండియా నుంచి ముగ్గురికి చోటు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ 2024 టెస్టు టీమ్ ఆఫ్ ది ఇయర్ జట్టును ప్రకటించింది. ఈ జట్టులో భారత్ నుంచి ముగ్గురు ప్లేయర్లకు చోటు దక్కింది. యశస్వీ జైస్వాల్, రవీంద్ర జడేజా, స్టార్ జస్ప్రీత్ బుమ్రా స్క్వాడ్‌లో ఉన్నారు. ఇక ఈ జట్టుకు ఆస్ట్రేలియా సారథి పాట్ కమిన్స్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. కాగా, ఈ జట్టులో అత్యధికంగా నలుగురు ఇంగ్లాండ్ ప్లేయర్లకు చోటు దక్కింది. బెన్ డకెట్, హ్యారీ బ్రూక్, జో రూట్, జిమ్మి స్మిత్ ఉన్నారు. మిగిలిన వాళ్లలో కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్), కామిందు మెండీస్ (శ్రీలంక), మ్యాట్ హెన్రీ (న్యూజిలాండ్) ఉన్నారు. ఇక టెస్టు జట్టు కంటే కాస్త ముందే ఐసీసీ 2024 వన్డే టీమ్ ఆఫ్ ది ఇయర్ జట్టు ప్రకటించింది. ఈ స్క్వాడ్‌లో టీమ్ఇండియా నుంచి ఒక్క ప్లేయర్ లేకపోవడం గమనార్హం.

**ఐసీసీ టెస్టు టీమ్ ఆఫ్ ది ఇయర్ :** యశస్వీ జైస్వాల్, బెన్ డకెట్, కేన్ విలియమ్సన్, జో రూట్, హ్యారీ బ్రూక్, కామిందు మెండీస్, జిమ్మీ స్మిత్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, పాట్ కమిన్స్ (కెప్టెన్), మ్యాట్ హెన్రీ, జస్ప్రీత్ బుమ్రా

# ఢిల్లీపై సౌరాష్ట్ర ఘన విజయం

## 12 వికెట్లతో సత్తా చాటిన జడేజా..



**బలగం టీవీ, హైదరాబాద్**

రంజీ ట్రోఫీలో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా సౌరాష్ట్ర తరపున అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. ఢిల్లీతో గురువారం ప్రారంభమైన మ్యాచ్‌లో రవీంద్ర జడేజా 12 వికెట్లు పడగొట్టి సౌరాష్ట్రకు ఘన విజయాన్ని అందించాడు. జడేజా ధాటికి ఈ మ్యాచ్ రెండు రోజుల్లోనే ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో (5/66) ఐదు వికెట్లు పడగొట్టిన జడేజా.. రెండో ఇన్నింగ్స్‌లో(7/38) ఏడు వికెట్లు తీసాడు. బ్యాటింగ్‌లో 38 పరుగులు చేసి కీలకమైన ఇన్నింగ్స్ ఆడాడు. దాంతో ఈ మ్యాచ్‌లో సౌరాష్ట్ర 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన జడేజాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# అఖండ 2లో సంయుక్త...

**బలగం టీవీ, హైదరాబాద్**




నటుడు నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం ఆఖండ 2లో నటిస్తున్న విషయం తెలిసిందే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ‘ంగ్యులర్ షూటింగ్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మూవీ నుంచి హీరోయిన్‌ని పరిచయం చేసింది చిత్రబృందం. ఈ మూవీలో మలయాళ భామ సంయుక్త నటించ బోతున్నట్టు చిత్రబృందం ప్రకటిం చింది. ఈ సందర్భంగా సంయుక్త పోస్టర్‌ని పంచుకుంది. ఇక ఈ సినిమాను 14రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట బీబీ4 నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి బాలయ్య కూతురు తేజస్విని కూడా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అఖండ తరువాత ఈ సినిమా వస్తుడటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఈ చిత్రం పొలిటికల్ టచ్‌తో ఉండబోతున్నట్లు తెలుస్తుంది.



# మళ్లీ నిరాశపర్చిన రోహిత్

**బలగం టీవీ, హైదరాబాద్**

రోహిత్ శర్మ మరోసారి నిరాశపరిచాడు. జమ్మూకశ్మీర్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో రోహిత్ శర్మ 28 రన్స్ చేసి ఔటయ్యాడు. కొన్ని ట్రేడ్‌మార్క్ షాట్లు కొట్టినట్లు కనిపించినా.. ఎక్కువ సేపు క్రీజ్‌లో నిలువలేకపోయాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో ముగిసిన టెస్టు సిరీస్‌లో పేలవంగా రోహిత్ ఆడిన సంగతి తెలిసిందే. అలాగే ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 19 బంతుల్లో 3 రన్స్ మాత్రమే చేసి రోహిత్ ఔటయ్యాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో ఓ అర్ధశతకాన్ని బాదుతాడేమో అని భావించినా.. ఆ మైలురాయిని అందుకోలేకపోయాడు. ఉమర్ నాజిర్ బౌలింగ్‌లో సిక్సర్.. నబీ, యుధ్‌విర్ బౌలింగ్‌లో కొన్ని బౌండరీలు సాధించినా.. భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత రోహిత్ .. దేశవాళీ క్రికెట్‌లో ఆడుతున్నాడు. నిజానికి రెండో ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లోనే రోహిత్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. రోహిత్ ఇచ్చిన రిటర్న్ క్యాచ్ బౌలర్ నజీర్ డ్రాప్ చేశాడు. ఒక్క రన్ వద్ద డ్రాప్ చేసినా.. 11 బంతుల్లో రోహిత్ 21 రన్స్ చేశాడు. ఆ తర్వాత జాగ్రత్తగా ఆడే ప్రయత్నం చేశాడు. రోహిత్ ఇన్నింగ్స్‌లో మూడు సిక్సర్లు, రెండు ఫోర్లు ఉన్నాయి.

## శార్దూల్ ఠాకూర్ సెంచరీ..!



ముంబై క్రికెటర్ శార్దూల్ ఠాకూర్ సెంచరీ బాదాడు. జమ్మూ కశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో 101 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ జట్టును శార్దూల్ ఠాకూర్ మరోసారి ఆదుకున్నాడు. 105 బంతుల్లో 15 ఫోర్లతో సెంచరీ నమోదు చేశాడు.

తొలి ఇన్నింగ్స్‌లోనూ శార్దూల్ ఠాకూర్ 51 పరుగులు చేసిన విషయం తెలిసిందే. శార్దూల్ సెంచరీతో ముంబై భారీ స్కోర్ దిశగా సాగుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 67 ఓవర్లలో 7 వికెట్లకు 274 పరు గులు చేసింది. ఇప్పటికే ముంబై ఆధిక్యం 188 పరుగులకు చేరింది. శార్దూల్ ఠాకూర్(119 బంతుల్లో 17 ఫోర్లతో 113) సెంచరీతో రాణించగా.. తనూష్ కోటియన్(119 బంతుల్లో 6 ఫోర్లతో 58 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.ఈ ఇద్దరూ ఇప్పటికే 8వ వికెట్‌కు 173 పరుగులు అజేయంగా జోడించారు. యశస్వి జైస్వాల్(26), రోహిత్ శర్మ(28) రాణించారు. జమ్మూ కశ్మీర్ బౌలర్లలో ఆకిబ్ నబీ(3/69) మూడు వికెట్లు తీయగా.. ఉమన్ నజీర్ మిర్(2/76), యుధ్‌వీర్ సింగ్(2/63) రెండేసి వికెట్లు తీసారు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 120 పరుగులకే ఆలౌటైంది. జమ్మూ కశ్మీర్ రెండో ఇన్నింగ్స్‌లో 41.3 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది.

# 8 వసంతాలు టీజర్ విడుదల


**బలగం టీవీ, హైదరాబాద్**

మ్యాడ్ ఫేం అనంతిక సనిల్ కుమార్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం ‘8 వసంతాలు’ . ఫణీంద్ర నర్సెట్టి డైరెక్ట్ చేస్తున్నాడు. టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవి శంకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో అనంతిక శుద్ధి అయోధ్య పాత్రలో నటిస్తున్నట్టు ఇప్పటికే తెలియజేశారు మేకర్స్. తాజాగా టీజర్ విడుదల చేశారు. ఇట్స్ ఓకే మూవ్ ఆన్ అవ్వాలి రా తప్పదు అని వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ క్యారెక్టర్ అంటుంటే అంత ఈజీ అనుకుంటున్నవా.. ? అసలు ప్రేమ నీ నుండి వెళ్లిపోతుంటే ఆ ఫీలింగ్ ఎలా ఉంటుందో తెలుసానే నీకు .. అంటూ చెప్తున్న సంభాషణలతో షురూ అయింది టీజర్. అందమైన లవ్ ట్రాక్, ట్యూన్‌తో ఫీల్ గుడ్‌గా సినిమా ఉండబోతున్నట్టు టీజర్ చెప్పకనే చెబుతోంది. అందాన్ని దాటి చూడగలిగితే ఆడదానిలో ఒక సముద్రమే కనిపిస్తుంది..అంటూ వచ్చే డైలాగ్ సినిమా మహిళా లోకానికి స్ఫూర్తి నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదనిపిస్తోంది. .




# దోమకొండ గడికోట ఆలయానికి ప్రియాంక చోప్రా

**బలగం టీవీ, హైదరాబాద్**



ఇటీవల చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసిన నటి ప్రియాంక చోప్రా... తాజాగా కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గడికోట సుప్రసిద్ధ మహాదేవుని ఆలయానికి వెళ్లారు. ఆమెకు టస్ట్ సభ్యులు, ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. సోమసూత్ర శివలింగానికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారామె. ఇందుకు సంబంధించిన వీడియోను ప్రియాంక తన ఇన్‌స్టా స్టోరీస్‌లో అభిమానులతో పంచుకున్నారు. ఇప్పుడీ వీడియో వైరల్ అవుతోంది.

# ‘పుష్ప 3’లో ఐటెం సాంగ్ కు జాన్వీ కరెక్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**

అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్లో ‘పుష్ప 3’ కూడా తెరకెక్కబోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చిత్రాలకు సంగీతం అందించిన దేవిశ్రీ ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ‘పుష్ప 3’లో ఐటెం సాంగ్ కు జాన్వీ కపూర్ డ్యాన్స్ చేస్తే అద్భుతంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ‘కిస్సిక్’ పాటలో ఎవరు నటించినా అంతర్జాతీయ స్థాయిలో పాప్యులర్ అవుతారని తమకు ముందే తెలుసని చెప్పారు. శ్రీలీల అద్భుతమైన డ్యాన్సర్ కాబట్టి ఆమెను తీసుకుంటే బాగుంటుందని మేకర్స్ కి తాను చెప్పానని తెలిపారు. ఎంతో మంది స్టార్ హీరోయిన్లు తన పాటల ద్వారా తొలిసారి ఐటెం సాంగ్స్ కు డ్యాన్స్ చేశారని చెప్పారు. పాట ఆధారంగా హీరోయిన్ ను ఎంపిక చేస్తారని చెప్పారు. సాయిపల్లవి డ్యాన్స్ కు తాను అభిమానినని తెలిపారు. శ్రీదేవిలో ఉన్న గ్రేస్ జాన్వీ కపూర్ లో ఉందని... అందుకే, రాబోయే సినిమాలో ఐటెం సాంగ్ కు ఆమే కరెక్ట్ అని తాను భావిస్తున్నానని చెప్పారు.



# ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి తప్పుకున్న జోకోవిచ్

**బలగం టీవీ, మెల్‌బోర్న్**

అనూహ్య రీతిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి నోవాక్ జోకోవిచ్‌తప్పుకున్నాడు. అలెగ్జాండర్ జ్వెరేవ్‌తో సెమీస్ మ్యాచ్ ఆడుతున్న సమయలో అతను గాయపడ్డాడు. ఆ మ్యాచ్‌లో తొలి సెట్‌ను 7-6 స్కోరుతో జ్వెరేవ్ గెలుచుకున్న సమయంలో జోకోవిచ్‌కు గాయం తీవ్రమైంది. దీంతో ఆట నుంచి తప్పుకున్నాడు. దాంతో జ్వెరేవ్ ఫైనల్లోకి ప్రవేశించాడు. అయితే 11వ సారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకునే అవకాశాన్ని జోకోవిచ్ కోల్పోయాడు. మంగళవారం కార్లోస్ అల్కరాజ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ సమయంలో తన ఎడమ కాలికి అతను టేపు వేసుకున్నాడు. సెమీస్‌లో ఫస్ట్ సెట్ పాయింట్ వద్ద నెట్ కావడంతో.. జోకోవిచ్ నెట్ వద్దకు వెళ్లి జ్వెరేవ్‌తో హ్యాండ్స్ షేక్ చేశాడు. మైదానం నుంచి వెళ్లిపోతూ ప్రేక్షకుల దిశగా థంప్స్ అప్ చూపిస్తూ వెళ్లిపోయాడు. మరోవైపు రాడ్ లేవర్ ఎరినాలో ప్రేక్షకులు మాత్రం అరుపులతో జోకోవిచ్‌ను ఆటపట్టించారు. ఎవరైనా గాయపడితే, ఆ క్రీడాకారుడిని వేధించవద్దు అని జ్వెరేవ్ తెలిపారు.